



కమలా నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు మీద నిర్మిస్తున్న భవనం

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు

నగరంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే లేడు. అందినకాడికి పుచ్చుకుని అక్రమ నిర్మాణాలను గాలికి వదిలేశారు. నగరంలో అత్యంత ఖరీదైన కమలానగర్‌లో జొన్నా ఐరన్‌మార్ట్ పక్కన నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నా ఏఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడం గమనార్హం. హౌసింగ్ బోర్డులో రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కు పక్కనే ఓ డాక్టర్ వీఎల్‌టీ చెల్లించకుండా భారీ భవనాన్ని నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదు. అశోక్‌నగర్, విద్యుత్తు నగర్ మెయిన్ రోడ్డులో లో వీఎల్‌టీ చెల్లించకుండా భవనాలు నిర్మిస్తున్నా కార్పొరేషన్ అధికారులు కనీసం నోటీసు కూడా ఇవ్వడం లేదు. సెవెన్ హిల్స్ కాలనీలో ఓ ప్రభుత్వ డాక్టర్ వీఎల్‌టీ చెల్లించకుండా భారీ అపార్ట్‌మెంట్ నిర్మించారు. ఏఎంసీ నుంచి నోటీసులు రావడంతో ఆపేశాడు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.



వీఎల్‌టీ చెల్లించకుండా హౌసింగ్ బోర్డు పార్కు పక్కన నిర్మిస్తున్న భవనం

మా ఇష్టం ..!

నగరంలో విచ్చలవిడిగా నిర్మాణాలు

- వీఎల్‌టీ కట్టరు.. నిబంధనలు పాటించరు
- పట్టించుకోని ఏఎంసీ అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో భవన నిర్మాణాల విషయంలో నిబంధనలకు నీళ్లు వదిలేశారు. ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాలంటే ఆ స్థలం ఎన్ని రోజులు ఖాళీగా ఉందో అంత వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ) కట్టాలి. ఆ తరువాతే తదుపరి అనుమతులు ఇస్తారు. ఇక నగరంలో భవన నిర్మాణం చేపట్టాలంటే రోడ్డుకు ఐదు అడుగులు లోపలకే నిర్మించాలి. కానీ వీటిని ఎవరూ పాటించరు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి, పన్నులు విధించాల్సిన రెవెన్యూ , టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు నిద్రమత్తులో మునిగి తేలుతున్నారు. దీంతో ఇష్టారీతిన నిర్మాణాలు వెలుస్తున్నాయి.

శాఖల మధ్య కొరవడిన సమన్వయం

అనంత నగరపాలక సంస్థలో ఆయా శాఖల మధ్య సమన్వయలోపం కొట్టుకొచ్చినట్లు కనిపిస్తోంది. వీఎల్‌టీ కట్టించుకోవాల్సిన రెవెన్యూ విభాగం అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ విభాగంలో ఇద్దరు ఆర్‌ఓలు, నలుగురు ఆర్‌ఐలు ఉన్నారు. అయితే ఒక్కో ఆర్‌ఓకి ఇద్దరు ఆర్‌ఐలను కేటాయించారు. ఇటీవల అక్రమ కట్టడాలపై బద్వేలు, జమ్మలమడుగు మున్సిపాలిటీలలో పైలెట్ ప్రాజెక్ట్‌గా సర్వే చేయడానికి ఓ ఆర్‌ఐను నియమించారు. దీంతో ఆర్‌ఐ స్థానంలో మరో ఆర్‌ఐకి నగరంలోని వార్డులను కేటాయించారు. ఆర్‌ఓకు అనుకూలంగా ఆర్‌ఐ ఉండటంతో సర్వేకి వెళ్లి వచ్చిన ఆర్‌ఐను దూరం పెడుతూ వచ్చారు. ఇలా రెవెన్యూ విభాగంలో అధికారుల మధ్య సమన్వయం లేక వీఎల్‌టీ, ఇతర పన్నుల వసూళ్లలో తీవ్ర జాప్యంతో పాటు అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం. టౌన్‌ప్లానింగ్ విభాగంలో 18మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. నిర్మాణాల్లో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి. అయితే వారి మధ్య ఎటువంటి సమన్వయం లేదు.



విద్యుత్ నగర్‌లో అనుమతి లేకుండా నిర్మాణాలు



అశోక్ నగర్‌లో ఇలా కట్టేస్తున్నారు...

నిబంధనల మేరకే...: బాలస్వామి, అనంత నగరపాలక సంస్థ కమిషనర్



ప్రభుత్వ నిబంధనలకు లోబడే నగరంలో నిర్మాణాలు చేపట్టాలి. ఖాళీ స్థలంలో భవనాలు నిర్మించడానికి ముందే వీఎల్‌టీ కట్టాలి. ఆ తరువాతే నిర్మాణాలు ప్రారంభించాలి. ఇక రోడ్డుకి ఐదు అడుగుల లోపలే నిర్మాణాలు ఉండాలి. మురుగు కాలవ మీద ఎటువంటి నిర్మాణాలు, వాహనాలకు పార్కింగ్ చేయరాదు. ఏఎంసీ నుంచి అనుమతి వచ్చిన తరువాత చేపట్టిన నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా ఇష్టానుసారంగా మా స్థలంలో మేము కట్టుకుంటామంటే కుదరదు.

సూపర్ సభకు స్వచ్ఛందంగా

లక్షల జనం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- జగన్ అసమర్థత వల్లే ఆర్డీటీకి కష్టాలు
- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభకు లక్షలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సభకు రెండు లక్షల మంది వస్తారని అంచనా వేయగా మూడు లక్షలమంది కంటే ఎక్కువగా తరలివచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. విజయోత్సవ సభ

(మిగతా 6లో...)

ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

- డీఎంహెచ్ఓ ఈబీ దేవి



ఆన్‌లైన్ నమోదుపై శిక్షణ ఇస్తున్న డాక్టర్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైద్య కేంద్రాలకు వచ్చేవారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ పొందుపరచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం పునరుత్పత్తి శిశు ఆరోగ్యం (ఆర్‌సీహెచ్) అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గతంలో ఇంటికెళ్లి గర్భవతుల వివరాలను సేకరించేవారమన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెడుతున్నారన్నారు. ప్రాథమిక వైద్య కేంద్రాలకు వచ్చే గర్భిణుల వివరాలను తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఎస్ఓ మహమ్మద్ రఫీ శిక్షణ ఇచ్చారు.

జవాబు పత్రాలు మాయం..?

- ఎస్కేయూలో కలకలం..!
- బయటకు పొక్కకుండా సద్దుమణిచే ప్రయత్నాలు
- రహస్య విచారణ చేయిస్తున్నారన్న చర్చ



ఎస్కేయూ ముఖద్వారం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ)లో కలకలం. జవాబు పత్రాలు మాయమయ్యాయన్న చర్చ జోరుగా సాగుతోంది. వర్సిటీలోని ఓ కళాశాలలోని ఓ కోర్సు సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాలు మాయమైనట్లు తెలుస్తోంది. రెండు నెలలు గడిచినా అవి ఎక్కడున్నాయి? ఏమయ్యాయి? అన్నది తెలియకపోవడం శోచనీయం. విషయాన్ని బయటకు పొక్కకుండా సద్దుమణిచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ క్రమంలోనే వర్సిటీ ఉన్నతాధికారులు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, విచారణ చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎక్కడికెళ్లాయో..?

ఈ ఏడాది మే నెలలో వివిధ సెమిస్టర్ పరీక్షలు వర్సిటీ పరీక్షల విభాగం నిర్వహించింది. వర్సిటీలోని ఓ కళాశాలలో పరీక్షలు జరిగాయి. అక్కడి నుంచి జవాబు పత్రాలు పరీక్షల విభాగానికి చేరాయి. అన్ని పరీక్షల అనంతరం జవాబు పత్రాల కోడింగ్, డీ కోడింగ్ పూర్తి చేసినట్లు సమాచారం. జూలై మొదటి వారంలో జవాబు పత్రాల మూల్యాంకనం కోసం వివిధ కళాశాలలకు తరలించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ కళాశాలకు పంపిన జవాబు పత్రాల్లో ఒక కోర్సు నాలుగో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టుకు సంబంధించినవి మాయమైనట్లు సంబంధిత వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇందులో 60 మంది విద్యార్థులకుపైగా జవాబు పత్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. సంబంధిత విభాగ ఉద్యోగులు.. (మిగతా 6లో..)

నూతన కలెక్టర్‌గా ఆనంద్

వినోద్ కుమార్ బాపట్లకు బదిలీ



నూతన కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా ఆనంద్‌ను నియమించారు. నెల్లూరు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను జిల్లాకి నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్‌గా పనిచేస్తున్న వినోద్‌కుమార్‌ను బాపట్లకు బదిలీ చేశారు. 2024 మే 4వతేదీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వినోద్‌కుమార్ 16 నెలలపాటు పనిచేశారు.

24 ఏళ్లకే కలెక్టర్...

నూతన కలెక్టర్ ఆనంద్ కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాలో 1992 ఫిబ్రవరి 4వతేదీ జన్మించారు. ఈయన కేరళ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్‌లో 2015లో బీటెక్ పూర్తిచేశారు. 24 ఏళ్ల వయసులోనే ఐఏఎస్ అయ్యారు. యూపీఎస్సీ పరీక్షల్లో ఆలిండియా 33వ ర్యాంకు సాధించారు. శిక్షణ అనంతరం తూర్పు గోదావరి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. గూడూరు సబ్ కలెక్టర్‌గా, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఐటీడీఏ, కేఆర్ పురం ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అనంతరం పార్వతీపురం మణ్యం జాయింట్ కలెక్టర్‌గా, విశాఖపట్నం పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతి పొందాక నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా నియమితుడయ్యారు. ఈ-గవర్నెన్స్ అంశంలో జాతీయ అవార్డు సాధించారు. ఈ నేపథ్యంలో ఆయనను జిల్లాకు నియమించారు.

సింగపూర్‌కు ధర్మవరం విద్యార్థినులు

ఫ్లోర్‌బాల్ పోటీలకు 12మంది ఎంపిక (6లో..)

కోయంబత్తూరు నుంచి కాల్..!

డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి వీడియో కాల్

- సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తున్నానంటూ సమాచారం
- కొత్తగా ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- ఇద్దరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి (వివరాలు 6లో..)

అందుబాటులో యూరియా: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 3272 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. వివిధ రైతు సేవాకేంద్రాల్లో 420 మెట్రిక్ టన్నులు, సొసైటీలలో 93 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 678 మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 1303, రవాణా కింద 778మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. ఇఫ్కో కంపెనీ ద్వారా 1130 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం జిల్లాకు వస్తుందన్నారు. ఇందులో ఏపీ మార్క్‌ఫెడ్‌కు 580 మెట్రిక్ టన్నులు, సొసైటీలకు 220, ప్రైవేట్ డీలర్లకు 330 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తామన్నారు. వ్యవసాయ అధికారుల ద్వారా ప్రతి గ్రామం, ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో యూరియా వాడకం మీద ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

దంచికొట్టిన వాన

ఉప్పొంగిన వాగులు.. వంకలు

- పరవళ్లు తొక్కిన చిత్రావతి, వేదవతి
- వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నీట మునిగిన పంట చేలు.. రైతులకు నష్టం





వేములపాడు వద్ద వంకలో ఆగిపోయిన కారును ట్రాక్టర్‌తో బయటకు లాగుతున్న దృశ్యం, భారీ వర్షంతో కోడూరు వద్ద పారుతున్న కుషావతి నది (7లో...)

వైసీపీ కోతలు.. కూటమిపైనే ఆశలు..

- కలగానే పీఆర్సీ ఏర్పాటు
- అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పెంపుపై అదే నిర్లిప్తత
- గత ప్రభుత్వంలో కోతలతో తీవ్ర నష్టం



పరిష్కారంకాని పెన్షనర్ల సమస్యలు.. అందని డీఆర్ అరియర్స్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైరైన పెన్షనర్లను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం వారిపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించింది. అప్పటి వరకు అందుతున్న ప్రయోజనాల్లో కోతలు పెట్టింది. ఆర్థిక ప్రయోజనాలను పూర్తిగా ఆపేసింది. దీంతో ఐదేళ్లు పెన్షనర్లు తీవ్రంగా నష్టపోయారు. డీఆర్ అరియర్స్ పెండింగ్‌లో ఉంచడంతోపాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఊసే ఎత్తకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అందించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పర్సెంటేజీలను వైసీపీ పాలకులు తగ్గించి మరింత ఆర్థికంగా కుంగదీశారు. ఈహెచ్‌ఎస్ పరిధిలోని మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను అందించకుండా ఇబ్బందులపాలు చేశారు. పెన్షనర్లు చనిపోతే తక్షణ దహన సంస్కారాల కింద అందించే రూ.25 వేలను పలువురు పెన్షనర్ల కుటుంబాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇన్ని సమస్యల నడుమ నెట్టుకొచ్చిన పెన్షనర్లు కూటమి ప్రభుత్వంలోనూ వాటిని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చి, ఆదుకోవాలని కోరుతున్నారు.


పెన్షనర్లు

కూటమి ప్రభుత్వంపై ఆశలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పెన్షనర్లు దాదాపు 25వేల మంది ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు 2018 జూలై 1 నుంచి డీఆర్ అరియర్స్‌ను పెండింగ్‌లో ఉంచింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పెన్షనర్లు చెబుతున్నారు. డీఏ అరియర్స్ విడుదల చేయడంతోపాటు, 1-7-2023 పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇంతవరకూ అమలు చేయకపోవడంతో గతేడాదివి రెండు, 2025లో ఒకటి కలిపి మరో మూడు డీఆర్ అరియర్స్ పెండింగ్ లిస్టులోకి చేరిపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఈ లెక్కన దాదాపు ఒక్కో పెన్షనర్‌కు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకూ డీఆర్ అరియర్స్ రూపంలో అందాల్సి ఉందని చెబుతున్నారు. అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ విషయంలోనూ 70 ఏళ్ల వయసున్న పెన్షనర్లకు 10 నుంచి 7 శాతానికి, 75 ఏళ్ల వయసు వారికి 15 శాతం నుంచి 12 శాతానికి వైసీపీ ప్రభుత్వం కుదించి ఆర్థికంగా దెబ్బతీసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో వాటిని పూర్వస్థితికి తీసుకొస్తామని హామీ ఇచ్చినా.. ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో పెన్షనర్లకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఈహెచ్‌ఎస్ పరిధిలో ప్రస్తుతం కేవలం కంటి, మోకాళ్లు, పంటి తదితర చిన్న చిన్న వాటికే వైద్యం చేయడం... సర్జరీలు జరిగిన వారికి అందించాల్సిన మెడికల్ రీయింబర్స్‌మెంట్లు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా పెన్షన్ శాతాన్ని బట్టి రూ.225 నుంచి రూ.300 ఈహెచ్‌ఎస్ కింద జమవుతున్నా... బిల్లులు రాకపోవడంతో డబ్బులు వెచ్చించి సర్జరీలు చేయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పెన్షనర్ చనిపోతే దహన సంస్కారాలకు అందించే డెత్ రిలీఫ్ మత్తం రూ.25 వేలు కూడా ఇవ్వట్లేదు. వీటిన్నింటినీ పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారనీ, వాటిని వీలైనంత త్వరగా అమలు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి



అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించడంతోపాటు ఈహెచ్‌ఎస్, డెత్ రిలీఫ్‌లు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఆ సమస్యలు అలాగే ఉన్నాయి. హామీలను నెరవేర్చి, పెన్షనర్లకు ఆదుకోవాలి.

- పెద్దనగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆంధ్రా పెన్షనర్ల పార్టీ

డెత్ రిలీఫ్‌లను విడుదల చేయాలి



చనిపోయిన పెన్షనర్లకు తక్షణసాయం కింద అందించే డెత్ రిలీఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం వాటిని రూ.10 వేలకు పరిమితం చేసింది. మునుపటిలా ఆ మెత్తాన్ని రూ.25 వేలకు పెంచి, పెన్షనర్లను ఆదుకోవాలి. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయడంతో పాటు... పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిన 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న మరో మూడు డీఆర్ అరియర్స్‌ను విడుదల చేయాలి.

- రామకృష్ణ, జిల్లా కోశాధికారి, ఏపీ పెన్షనర్ల సంఘం

మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను పెంచాలి



టీడీపీ హయాంలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ కింద రూ.2 లక్షల వరకూ వర్తించేది. వైసీపీ హయాంలో దానిని పెంచకపోగా... రూ.2 లక్షలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టింది. ఈహెచ్‌ఎస్ ఊసేలేకుండా చేసింది. పెన్షనర్లు చేతినుంచి డబ్బులు పెట్టుకోవాల్సి వచ్చింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం ఈహెచ్‌ఎస్ కింద కంటి, పంటి, మోకాళ్ల తదితర వాటికి మాత్రమే అమలు చేస్తున్నారు. సర్జరీలు చేయించుకున్న పెన్షనర్లు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని విడుదల చేయడంతో పాటు... రీయింబర్స్‌మెంట్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి.

-ప్రభాకర్, జిల్లా నిర్వాహక కార్యదర్శి, ఏపీ పెన్షనర్ల సంఘం

కోయంబత్తూరు నుంచి కాల్..!

- డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి వీడియో కాల్
- సర్టిఫికెట్ల పరిశీలనకు వస్తున్నానంటూ సమాచారం
- కొత్తగా ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- ఇద్దరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి


కోయంబత్తూరు నుంచి వీడియో కాల్‌లో ఐటీ సెల్ ఏపీఓతో మాట్లాడుతున్న డీఎస్సీ సెలెక్ట్ అభ్యర్థి రమ్యశిల్ప

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో అనర్హుల ఏరివేత కొనసాగుతోంది. అదే సమయంలో అర్హులు ఎక్కడున్నా అవకాశం కల్పిస్తున్నారు. డీఎస్సీ రాసిన అభ్యర్థులు తుది జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆశలు వదులుకున్నారు. తమ పనుల్లో నిమగ్నమయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన పకడ్బందీగా చేపట్టడంతో బోగస్‌లు బయటపడ్డారు. వారిని రిజెక్ట్ చేయడంతో కొత్త వారిని అవకాశం వెతుక్కుంటూ వెళ్తోంది. తాజాగా మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖాధికారులు కాల్ లెటర్లు పంపారు. సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. కోయంబత్తూరులో ఉన్న ఓ అభ్యర్థి.. విద్యాశాఖ అధికారులకు వీడియో కాల్ చేశారు. తాను కోయంబత్తూరులో ఉన్నానంటూ సమాచారం ఇచ్చారు.

మళ్లీ.. మళ్లీ.. పరిశీలన

నిబంధనల మేరకు అర్హత ఉంటే ఎక్కడ ఉన్నా ఉద్యోగం వస్తుందనడానికి డీఎస్సీ-2025 నియమకాల ప్రక్రియే నిదర్శనం. జిల్లాలో 807 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వేలాదిమంది అభ్యర్థులు పోటీపడ్డారు. ఈసారి బోగస్‌లను ఏరివేసి నిజమైన అర్హులకే ఉద్యోగాలు కట్టబెట్టాలని సర్కారు పటిష్ట చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే డీఎస్సీ నియామకాల ప్రక్రియను రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 773 మంది అభ్యర్థులకు ఎంపిక కాల్ లెటర్లు వచ్చాయి. వారందరి ఒరిజనల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ నేతృత్వంలో ప్రత్యేక కమిటీలు పరిశీలించాయి. ఇప్పటికి ఐదుసార్లు పరిశీలన చేయించారు. అనుమానం, ఆరోపణలు వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లపై సంబంధిత శాఖలకు పంపి, అక్కడి నుంచి ఆమోదం లభిస్తేనే ఆమోదం తెలుపుతున్నారు. లేదంటే రిజెక్ట్ చేస్తున్నారు. ఇలాంటివి జిల్లాలో 14 తిరస్కరించారు. మరో నాలుగైదింటిపై సంబంధిత శాఖల నివేదికల కోసం వేచి చూస్తున్నారు.

తాజాగా మరో ముగ్గురికి కాల్‌లెటర్లు

డీఎస్సీ నియామకాల పక్రియ ముగింపు దశకు చేరుకోవడంతో పూర్తిస్థాయిలో సెలెక్షన్ లిస్టు తయారు చేసి ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే డ్యూయల్ పోస్టులు, అసత్య సమాచారంతో రిజక్ట్ అయిన అభ్యర్థుల స్థానంలో ఆ తరువాతి స్థానాల్లో ఉన్న వారికి రాష్ట్రశాఖ కాల్‌లెటర్లు పంపిస్తోంది. అందులో భాగంగా గురువారం మరో ముగ్గురు డీఎస్సీ అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులను పిలిపించుకుని సాయంత్రంలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, నివేదికలు పంపాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులు జిల్లాలోనే ఉన్నారు. వారు సాయంత్రానికి సర్టిఫికెట్లు తీసుకొచ్చి పరిశీలన చేయించుకున్నారు. రాయదుర్గానికి చెందిన అభ్యర్థి రమ్యశిల్ప కోయంబత్తూరులో ఉన్నట్లు విద్యాశాఖ అధికారులకు తెలిపారు. వీడియోకాల్ చేసి కోయంబత్తూరులో ఉన్నాననీ, బయల్దేరానంటూ విద్యాశాఖ ఐటీసెల్ సిబ్బందికి వివరణ చేసుకున్నారు. అదేవీడియో కాల్ మాటలను రికార్డు చేసుకుని, డీఈఓ ప్రసాద్‌బాబుకు ఆమె పంపించారు. దీనిని బట్టి అర్హత ఉంటే ఎక్కడున్నా ఉద్యోగం వస్తుందని స్పష్టమైంది.

సభ సక్సెస్‌కు పూల బాట

- సూపర్ 'హిట్' కోసం ఆర్టీసీ జోనల్ చైర్మన్ ప్రత్యేక చొరవ


బస్సుల ఏర్పాటుపై మంత్రులు, కలెక్టర్, అధికారులతో చర్చిస్తున్న పూల నాగరాజు(ఫైల్)

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ -సూపర్ హిట్ విజయోత్సవ సభకు బస్సుల సమీకరణలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రత్యేక చొరవ చూపారు. వారం రోజులుగా జిల్లా కేంద్రంలోనే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు ఆర్టీసీ, రవాణాశాఖ అధికారులతో పూల నాగరాజు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బస్సుల సమీకరణపై చర్చలు జరిపారు. సాధారణ ప్రయాణికులకు ఇబ్బంది కలగని విధంగా ఆర్టీసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సమీకరించాల్సిన బస్సులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి మంత్రి ద్వారా ఆమోదం పొందారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 3050 ఆర్టీసీ బస్సులు, 600 ప్రైవేట్ బస్సులను ముఖ్యమంత్రి సభకు ఏర్పాటు చేయించి సభ విజయవంతంలో తన వంతు పాత్ర పోషించారు.

అనుకున్న లక్ష్యాన్ని సాధించాం

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభకు 2 లక్షల మందిని తరలించాలనే లక్ష్యంతో బస్సుల ఏర్పాట్లకు మంత్రులు, జిల్లా అధికారుల సహకారంతో చర్యలు చేపట్టాం. అయితే మేము అనుకున్న లక్ష్యం మేరకు ప్రజలు తరలి వచ్చారు. కొన్ని రూట్లలో బస్సులు నిండిపోయి టాపు పైన కూడా ఎక్కి అభిమానులు తరలివచ్చారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి కూటమి ప్రభుత్వంపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

డీఎఫ్ఓ విఘ్నేష్ బదిలీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) విఘ్నేష్ అప్పావు బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వం గురువారం బదిలీ చేసింది. ఈ క్రమంలో డీఎఫ్ఓ విఘ్నేష్‌ను ఆత్మకూరులోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్)కు డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీఎఫ్ఓగా ఇంకా ఎవరినీ నియమించలేదు.

జవాబు పత్రాలు మాయం..?

(5వ పేజీ తరువాయి)

విషయం వర్సిటీ ఉన్నతాధికారులకు తెలియకుండా గుట్టుగా ఉంచినట్లు సమాచారం. ఈక్రమంలోనే సదరు విభాగంతోపాటు ఇతరత్రా చోట్ల జవాబు పత్రాల కోసం వెతికినట్లు తెలుస్తోంది. దొరక్కపోవడంతో సదరు ఉద్యోగులు మిన్నకుండిపోయినట్లు సమాచారం. కొన్నిరోజుల కిందట మార్కుల కంప్యూటరీకరణ నేపథ్యంలో విషయం బయటికొచ్చినట్లు ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. సంబంధిత సబ్జెక్టు మార్కుల వివరాలు లేకపోవడంతో విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమచారం. ఈక్రమంలోనే వ్యవహారం వర్సిటీ ఉన్నతాధికారులు చేరడంతో విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు ప్రత్యేక కమిటీని నియమించినట్లు ఆయావర్గాల్లో చర్చ జరుగుతోంది.

బయటకు పొక్కకుండా..

జవాబు పత్రాల మాయం విషయం బయటకు పొక్కకుండా వర్సిటీ అధికారులు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. విషయం బయటకు తెలిస్తే వర్సిటీ ప్రతిష్ట దిగజారడంతోపాటు విమర్శలు, ఆందోళనలు తలెత్తుతాయని గుట్టుగా సద్దుమణిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు వర్సిటీలో చర్చ సాగుతోంది. అధికారులు అలాంటిదేమీ లేదని కొట్టి పారేసుండడం గమనార్హం. రహస్య విచారణ చేస్తున్నారన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా

పరీక్షల విభాగ కంట్రోలర్‌గా ఇటీవలే బాధ్యతలు తీసుకున్నా. జవాబు పత్రాలు కనిపించడం లేదన్న విషయం నా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే విచారణ చేయిస్తాం.

-శ్రీరాములు నాయక్, పరీక్షల విభాగ కంట్రోలర్, ఎస్కేయూ

మా దృష్టికి రాలేదు..

వర్సిటీలో జవాబు పత్రాలు కనిపించడం లేదన్న విషయం మా దృష్టికి రాలేదు. విచారణ నిమిత్తం ప్రత్యేక కమిటీని కూడా నియమించ లేదు. కమిటీని నియమిస్తే కచ్చితంగా చెబుతాం. అందులో రహస్యం ఏముంటుంది?

-రాజశేఖర్ బాబు, రిజిస్ట్రార్, ఎస్కేయూ

లారీ బీభత్సం..!

- మహిళా కార్మికుల ఆటోను ఢీకొని ఆపకుండా ముందుకు..
- దారిలో ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకెళ్లిన వైనం
- కిలోమీటర్ల మేర బైక్‌లపై వెంబడించిన స్థానికులు
- లారీలు అడ్డుగా పెట్టి పట్టుకుని.. డ్రైవర్‌కు దేహశుద్ధి


లారీని ద్విచక్రవానాల్లో వెంబడిస్తున్న యువకులు



గాయపడిన అన్నపూర్ణ, ఉమాదేవి

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో గురువారం సాయంత్రం లారీ బీభత్సం సృష్టించింది. మహిళా కార్మికుల ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. డ్రైవర్ ఆపకుండా అలానే ముందుకెళ్లాడు. స్థానికులు బైక్‌లలో వెంబడించారు. దారిలో మరో బైక్‌ను లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. దాదాపు 10 కిలోమీటర్ల మీర స్థానికులు బైక్‌లలో వెంబడించారు. ఆ ఛేజింగ్ సీన్ సినిమా స్టంట్‌ను తలపించింది. ఆఖరుకు రోడ్డుకు అడ్డుగా లారీలను ఉంచి, పట్టుకున్నారు. లారీ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. హిందూపురం పట్టణ పరిధి కొల్లకుంట సమీపంలో సాయంత్రం గార్మెంట్స్ కార్మికులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో అన్నపూర్ణ, ఉమాదేవికి గాయాలయ్యాయి. లారీ ఆపకుండా పెనుకొండ వైపు వెళ్తుండగా అక్కడున్న కొంతమంది యువకులు సుమారు 10కి.మి. మేర ద్విచక్రవాహనాల్లో వెంబడించారు. దారిలో పక్కనే ఆపిన బైక్‌ను సైతం లారీ కిలోమీటరు మేర ఈడ్చుకెళ్లింది. ఆఖరుకు చాలకూరు-బ్రాహ్మణపల్లి గ్రామాల మధ్య లారీని పట్టుకుని, డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న సోమందేపల్లి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, లారీని సోమందేపల్లి స్టేషన్‌కు తరలించారు. గాయపడినవారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సూపర్ సభకు స్వచ్ఛందంగా లక్షల జనం

(5వ పేజీ తరువాయి)

సక్సెస్ కావడం సంతోషంగా ఉందన్నారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం మభ్యపెట్టి జనాలను తరలించారంటూ ఫేక్ ప్రచారాలకు దిగడం శోచనీయమన్నారు. విప్ కాలవ శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ తొలిసభ అనంతపురంలో జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతపురం అభివృద్ధి, సీమ భవిష్యత్తు టీడీపీతోనే ముడిపడి ఉందన్నారు. సూపర్ హిట్ సభ నభూతో నభవిష్యత్తు అన్న రీతిలో జరిగిందన్నారు. రాయలసీమ గడ్డ టీడీపీ అడ్డాగా మారిందనడానికి మొన్న కడపలో జరిగిన మహానాడు, నిన్నటి అనంతలో జరిగిన సభ నిదర్శనం అన్నారు. ఈ ఆదరణను చూసే కుట్రతో జగన్ ఏది పడితే అది మాట్లాడుతున్నాడంటూ మండిపడ్డారు. జగన్ అసమర్థత, ఎంపీల స్వార్థం వల్లే 2021 నుంచి ఆర్డీటీకి కష్టాలు మొదలయ్యాయన్నారు. ఆర్డీటీ సేవలపై కేంద్రానికి వివరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ మంజూరు చేయించే బాధ్యతను ఇద్దరు ఎంపీలకు సీఎం అప్పగించినట్లు తెలిపారు. ఈ అంశంపై జగన్‌కు, వైసీపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ఎందుకు ప్రయత్నాలు చేయలేదంటూ ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరరెడ్డి, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌చౌదరి, శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు అంజినప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఇతర టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు తదితరులు పాల్గొన్నారు.

14న కబడ్డీ ఎంపిక పోటీలు

కదిరిఅర్బన్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో 14వ తేదీన కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ గురువారం ప్రకటనలో తెలిపారు. 20 సంవత్సరాలలోపు, బాలబాలికలు అర్హులన్నారు. బాలురు 75 కిలోలలోపు, బాలికలు 65కిలోలలోపు బరువు ఉండాలన్నారు. ఎంపికైన వారు విజయవాడలో ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

సింగపూర్‌కు ధర్మవరం విద్యార్థినులు

- ఫ్లోర్‌బాల్ పోటీలకు 12 మంది ఎంపిక

ధర్మవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఫ్లోర్‌బాల్ పోటీల్లో అద్భుత ప్రతిభ చూపినట్లు హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి, పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, పీడీ మాట్లాడుతూ గత నెలలో నరసరావుపేటలో జరిగిన 19వ నేషనల్ ఫ్లోర్‌బాల్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్-14 విభాగంలో 14 మంది జాతీయ స్థాయిలో పాల్గొనగా 12మంది అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. 8వతరగతికి చెందిన గీతిక, హేమశ్రీ, అప్నా అంజన్, రోహిణి, సాయిగీతిక, జాహ్నవి, 9వతరగతికి చెందిన తేజశ్రీ, నందిని, ఉషశ్రీ, శ్రీదేవి, ఈశ్వరి, గౌతమి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు ఈనెల నాలుగో వారం లేదా అక్టోబరు మొదటి వారంలో సింగపూర్‌లో నిర్వహించే ఫ్లోర్‌బాల్ అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వీరిని బీఎస్ఆర్ బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి, పాఠశాల కమిటీ చైర్మన్ బాబావలి, ఉపాధ్యాయులు అభినందించారు.


అంతర్జాతీయ ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల హెచ్‌ఎం, పీడీలు

ఒకే ఒక్కడు !

మూడేళ్లలో మూడువేలకుపైగా కంటి శస్త్ర చికిత్సలు

- రాష్ట్రంలోనే జిల్లాను టాప్‌లో నిలిపిన డాక్టర్ సైదన్న
- అరకొర సౌకర్యాలతోనే అన్నీ తానై నిర్వహిస్తున్న వైద్యుడు


డాక్టర్ సైదన్నతో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న వారు (ఫైల్)


నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సైదన్న


అనంతపురం వైద్యం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్కడు. మూడేళ్లలో మూడువేలకు పైగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించాడు. జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రిలో నేత్రవైద్య నిపుణుడిగా పని చేస్తున్న డాక్టర్ సైదన్న ఎన్‌పీసీబీవీఐ (నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపైర్‌మెంట్) ద్వారా మూడేళ్లలో 3,160 ఉచిత కంటి ఆపరేషన్లు చేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5వరకు 15 రోజుల పాటు నిర్వహించిన జాతీయ నేత్ర దాన అవగాహన సదస్సులో భాగంగా డాక్టర్ సైదన్న విద్యాసంస్థలు, జన సమూహ ప్రాంతాలకెళ్లి నేత్ర దానం, అంధత్వ నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అన్నీ తానై..

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీఎంహెచ్‌ఓ కార్యదర్శిగా ఎన్‌పీసీబీవీఐ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో ఎన్‌పీసీబీవీఐ నిర్వహణ కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనుబంధ క్యాన్సర్ యూనిట్‌లో ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఇందులో వారంలో రెండు రోజులు పాటు ఆపరేషన్లు చేస్తూ పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేయడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందడంలేదని తెలుస్తోంది. ఓపీ, ఐపీ, ఓటీ మూడు విభాగాలకు సరిపడా సిబ్బందిని నియమించడంలో ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఓటీ అసిస్టెంట్, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓ, స్టాఫ్ నర్స్, అటెండర్లు ఇలా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్నీ తానై డాక్టర్ సైదన్న ఆపరేషన్లు చేసి ఎంతో మంది పేదలకు చూపును ప్రసాదిస్తున్నారు. ఎన్‌పీసీబీవీఐ నిర్వహణపై ఉన్నతాధికారులు అలసత్వాన్ని వీడి చేయూతని ఇవ్వాల్సిన అవసరం ఉంది.




సృష్టిలో ఏకైక సేవామార్గం



నేత్ర దానం కంటే సృష్టిలో గొప్పసేవా మార్గం మరొకటి లేదు. మరణాంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. డాక్టర్‌గా నాకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్‌పీసీబీవీఐ ద్వారా నేత్ర శస్త్రచికిత్సలు చేస్తున్నా. మూడేళ్లలో 3,160 కంటి ఆపరేషన్లు చేశా. ఆపరేషన్ చేయించుకున్న ప్రతిఒక్కరూ తిరిగి చూపును పొందుతున్నారు. దీంతో జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల వారు తరలివస్తున్నారు.

- డాక్టర్ సైదన్న, ఎన్‌పీసీబీవీఐ, ఆప్తాల్మిక్ సివిల్ సర్జన్

దంచికొట్టిన వాన



చెట్నేపల్లి సమీపంలో పారుతున్న ఉప్పు వంక

ఉప్పొంగిన వాగులు.. వంకలు
పరవళ్లు తొక్కిన చిత్రావతి, వేదవతి
వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం
నీట మునిగిన పంట చేలు.. రైతులకు నష్టం

భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. నదులు పరవళ్లు తొక్కాయి. చెక్‌డ్యాంలు, ఫాం పాండ్లకు భారీగా నీరు చేరింది. పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కంది, వరి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. కణేకల్లు మండలంలో 16 హెక్టార్లల్లో రూ.4.05 లక్షల విలువైన వరి పంట దెబ్బతింది. జిల్లా వ్యాప్తంగా 83.81 హెక్టార్లల్లో రూ.20.95 లక్షల విలువైన వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ యంత్రాంగం ప్రాథమిక అంచనా వేసింది. గుత్తి, యాడికి మండలాల్లో 3.53 హెక్టార్లల్లో రూ.9 లక్షల విలువైన టమోటా పంట దెబ్బతింది. శింగనమల మండలం గోవిందరావు పేటలో రైతులు రామాంజినేయులు, ఆదినారాయణకు చెందిన 3 ఎకరాల్లో కోత కోసిన వేరుశగన పంట వర్షానికి కొట్టుకుపోయింది. రూ.2 లక్షలకుపైగా పంటనష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. బొమ్మనహాళ్ మండలంలోని 50 ఎకరాల్లో వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది.



గరుడచేడు వద్ద నీట మునిగిన వేరుశనగ పంట

కాలనీలు జలమయం

● గుత్తి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎస్‌టీఐ కాలనీ, గుత్తి ఆర్‌ఎస్‌లోని సుద్ద ఫ్యాక్టరీ ప్రాంతం, బీసీ కాలనీ, జగనన్న కాలనీల జలమయం అయ్యాయి. చెట్నేపల్లి సమీపంలోని ఉప్పు వంక రోడ్డుపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే బ్రిడ్జి కింద భారీ ఎత్తున నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

● గుత్తి మండలం బేతాపల్లి, బసినేపల్లి, ఊటకల్లు, ఊబిచేర్ల, చెట్నేపల్లి, ధర్మాపురం కరిడికొండ తదితర గ్రామాలల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలో 8.62 సెం.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దారు పుణ్యవతి తెలిపారు.

● బొమ్మనహాళ్ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేదవతి హగరికి భారీగా వరద నీరు చేరింది. ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ క్రాస్, లింగదహాళ్, కొళగానహళ్లి తదితర గ్రామాల వద్ద వరి పంట నీట మునిగింది. కొళగానహళ్లి సమీపంలో కబ్బాలి వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. ఉద్దేహాళ్ హైస్కూల్, సినిమా థియేటర్ ఆవరణలోకి భారీగా నీరు చేరింది. పత్తి, మొక్కజొన్న పంట నీట మునిగాయి. ఈ నీటిని తొలగించుకోవాలని వ్యవసాయాధికారి సాయికుమార్ రైతులకు సూచించారు.

● ఉరవకొండ మండలంలో 9.02 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఈశ్వరమ్మ దేవాలయం ప్రాంతం జలమయం అయ్యింది. బూదగవి చెరువులోకి భారీగా వర్షపు నీరు చేరింది. వజ్రకరూరు మండలంలో 7.78 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పొట్టిపాడు- చాయాపురం మధ్య వంక ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

● కనగానపల్లి మండలంలో 2.62 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దాదులూరు, మామిళ్లపల్లి, కనగానపల్లి, తూంచెర్ల ప్రాంతాల్లో కుంటలు, చెక్‌డ్యాంల్లోకి నీరు చేరింది. పొలాల్లో వేరుశనగ కట్టె, విత్తన కాయలు తడిచి నష్టపోయామని రైతులు సూరి, గోవిందు, జనార్దన, నాగరాజు తెలిపారు.

● డి. హీరేహాళ్ మండలంలో 3.7 సెం.మీ. వర్షం కురిసిందని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. వంకలు, వాగులు పొర్లి పొంగాయి. గొడిశలపల్లి, ఏళంజి గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. రాయదుర్గం మండలం టి.వీరాపురం వద్ద గాలివానకు భారీ వృక్షాలు కూలిపోయాయి. రాయదుర్గం-కణేకల్లుకు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● కణేకల్లు మండలంలో 9.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వేదవతి హగరిలో భారీగా వరదనీరు ప్రవహించడంతో కణేకల్లు, ఉరవకొండ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బెణెకల్లు, సీతానగర్ క్యాంపుల వద్ద వంక పొంగిపొర్లడంతోరాకపోకలు నిలిచిపోయాయి. గరుడచేడులో వేరుశనగ పంటలు నీట మునిగాయి.

నదుల పరవళ్లు

చిలమత్తూరు: మండలంలో కుషావతి, చిత్రావతి నదులు పవరళ్లు తొక్కాయి. కర్ణాటకలోని గుడిబండ, వాటం కొత్తపల్లి ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కుషావతికి నీరు చేరింది. తెల్లవారే వరకూ ప్రశాంతంగా ఉన్న నది.. ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించింది. ఈ ఏడాది నది ప్రవహించడం ఇదే తొలిసారి. నది ఎండిపోవడంతో బోరుబావులు అడుగంటాయి. తాజా నీటితో రీచార్జి అవుతాయని రైతులు భావిస్తున్నారు. మండలంలో మోస్తరు వర్షం కురిసింది. మొక్కజొన్న పంటకు మేలు జరుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యల్లనూరులో కుండపోత

యల్లనూరు మండలంలో బుధవారం రాత్రి 10.6 సెం.మీ. వర్షపాతం నమోదైందని తహసీల్దార్ రాము తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5గంటల వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గిరమ్మబావి వంక, మడుగు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. చిత్రావతినదికి నీటి ఉధృతి పెరిగింది. యల్లనూరులో చెట్టు విరిగి పడి రామాంజనేయులుకు చెందిన కారు ధ్వంసమైంది.



చిత్రావతి నదిలో ప్రవహిస్తున్న నీరు

జలపాతం కనువిందు



రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం

యాడికి మండలంలో 5.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిట్టూరు వద్ద వంక ఉధృతంగా ప్రవహించింది. వేములపాడు వద్ద వంకలో ఒక కారు ఇరుక్కుపోయింది. స్థానికులు ట్రాక్టర్ సాయంతో బయటకు లాగారు. కోనుప్పలపాడు రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జలపాతం కనువిందు చేస్తోంది.



నిట్టూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

చెక్‌డ్యాంలు కళకళ



శింగనమల ఆయకట్టు భూముల్లో నీరు

శింగనమల మండలంలో చెక్‌డ్యాంలు, ఫాం పాండ్లు కళకళలాడుతున్నాయి. ఆకులేడు, లోలూరు మినహా అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గోవిందరాయునిపేటలో వేరుశనగ పంట కొట్టుకుపోవడంతో రైతు రామాంజినేయులు తీవ్రంగా నష్టపోయాడు.



కొట్టుకుపోయిన వేరుశనగ పంట

స్తంభించిన రాకపోకలు

విడపనకల్లు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఆర్.కొట్టాల-గడేకల్లు, పొలికి-పెంచలపాడు, ఉరవకొండ-ఉండబండ, పాల్తూరు-గోవిందవాడ దారుల్లో వంకలు ఉధృతంగా ప్రవహించాయి. ఆ ప్రాంత గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. ఈ దారుల్లో గుంతకల్లుకు వెళ్లే ప్రయాణికులు ఉరవకొండ మీదుగా ప్రయాణించారు. గుంతకల్లు నుంచి బళ్లారికి వెళ్లేవారు కర్ణాటకలోని జోళదరాశి గ్రామం మీదుగా ప్రయాణించారు.



ఆర్ కొట్టాల, గడేకల్లు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వంక

పట్టు రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నా పట్టు - నా అభిమానంలో పాల్గొన్న ఎంపీలు అంబికా, బీకే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పట్టు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అన్నారు. పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో నా పట్టు-నా అభిమానం అనే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలతో పాటు సెంట్రల్ సిల్క్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డైరెక్టర్ అరుణకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు నెలలో మడకశిరలో పర్యటించి నపుడు పట్టు రైతులు, రీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కూడా పట్టు రైతుల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ మల్బరీ రైతులకు గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం అధికంగా తోడ్పాటు ఇస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు రైతులకు మెలకువలు నేర్పుతు లాభాలు గడించేలా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ పట్టు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందేలా పని చేస్తామన్నారు. పట్టు గూళ్లకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ మల్బరీ రైతుల షెడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు. రైతులు.. శాస్త్రవేత్తల ద్వారా మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడి సాధించాలని అభిలషించారు. అనంతరం ఉత్తమ రైతులకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, ఏడీ హనుమంతరాయ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక రైలు

గుంతకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా రద్దీని నియంత్రించడానికి బెంగళూరు-బీదర్ మధ్య (వయా గుంతకల్లు) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06291) ఈనెల 30వతేదీ రాత్రి 9-15 గంటలకు బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు 11-30 గంటలకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 06292) బీదర్‌లో అక్టోబరు 1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు బెంగళూరుకు చేరుతుందన్నారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, వాడి, షాహాబాద్, కలబురగి, హుమ్నాబాద్ స్టేషన్ల మీదుగా బీదర్ చేరుతుందన్నారు.

ఏడు దరఖాస్తుల తిరస్కరణ

వయోజన విద్య సూపర్ వైజర్ పోస్టులకు 21 అప్లికేషన్లు
పరిశీలనలో 14 ఆమోదం... నేటి ఇంటర్వ్యూలు వాయిదా

అనంతపురం విద్య, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): వయోజన విద్య శాఖలో ఖాళీగా ఉన్న కదిరి, పెనుకొండ డివిజన్‌కు చెందిన రెండు సూపర్‌వైజర్ పోస్టులకు టీచర్లు పోటీ పడ్డారు. ఎస్జీ కేడర్ టీచర్లు 21మంది దరఖాస్తు చేసుకున్నారు. కనీసం పదేళ్ల సర్వీస్ ఉండి 45 ఏళ్ల వయసులోపు ఉన్నవారిని అర్హులుగా నిర్ణయించారు. వచ్చిన దరఖాస్తులను గురువారం వయోజన విద్య డీడీ వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. పదేళ్ల సర్వీస్ లేనివారు, వయసు దాటిన వారు ఏడుగురిని గుర్తించి, వారి దరఖాస్తులను తిరస్కరించినట్లు డీడీ తెలిపారు. అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని వాయిదా వేశామన్నారు. ఎప్పుడు నిర్వహించేదీ తరువాత తెలియజేస్తామని డీడీ వివరించారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అర్హులైన ముస్లింలు, దూదేకులు, క్రిస్టియన్ మైనారిటీలు ప్రధానమంత్రి విశ్వకర్మయోజనకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి జగన్‌మోహన్ గురువారం ప్రకటనలో కోరారు. ఈ పథకం ద్వారా సంప్రదాయ వృత్తులు (స్వర్ణకారులు, కార్పెంటర్లు, శిల్పకారులు, కొలిమి, బుట్టలు, చాపలు, పరకలు అల్లికవారు, చెప్పులు కుట్టేవారు, దోబీ, కుమ్మరి, దర్జీ, తాపీ కార్మికులు, బార్బర్, రాళ్లు కొట్టేవారు, పూలదండలు, బొమ్మలు, తాళాలు తదితర పనులు చేసేవారు) అనుసరించేవారికి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ పరికరాల కొనుగోలుకు లక్ష నుంచి మూడు లక్షల వరకు 5శాతం వడ్డీతో బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందుతుందన్నారు. 18 ఏళ్లు నిండి, గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రుణాలు పొందని వారు అర్హులన్నారు. లబ్ధిదారులకు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఉండాలన్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.పీఎంవీఐఎస్‌హెచ్‌డబ్ల్యూఏకేఏఆర్‌ఎంఏ, జీఓవీ.ఐఎన్‌లో లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అరటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం

ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్

ధర్మవరంరూరల్/రాప్తాడు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అరటి పంటకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి, గిట్టుబాటు ధరలు దక్కేలా చూస్తామని ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ధర్మవరం మండలం ఉప్పునేసినపల్లి, రాప్తాడు మండలం మరూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఉప్పునేసినపల్లి వద్ద రైతు నారా అశోక్ 25ఎకరాల్లో సాగుచేసిన అరటి పంటను కమిషనర్ పరిశీలించారు. పంట సాగుపై రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరూరు వద్ద చీనీ, అరటి రైతులతో చర్చించారు. ఊరూరా రైతులు విరివిగా ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ఆయన వెంట అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఉద్యాన శాఖాధికారులు ఉమాదేవి, చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీలు రఘునాథ్ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

బస్సును ఢీకొట్టిన టీచర్ల కారు

ఒకరికి తీవ్రగాయాలు



బస్సును ఢీకొట్టిన కారు

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం లోలూరు గ్రామ సమీపాన జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఆపివున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి టీచర్ల కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం తరిమెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు రోజూ అనంతపురం నుంచి వెళ్లివస్తుండేవారు. అందులో భాగంగా గురువారం ఉదయం ఐదుగురు టీచర్లు పాఠశాలకు బయల్దేరారు. లోలూరు వద్ద ఆర్టీసీ బస్సు ఆపి.. ప్యాసింజర్ దిగుతుండగా.. వెనుక నుంచి టీచర్ల కారు ఢీకొంది. దీంతో కారులో డ్రైవర్ పక్కన కూర్చున్న మహిళా టీచర్ ఆర్థర్ జాన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను అనంతపురంలోని సాయినగర్‌లోగల ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. గాయపడిన టీచర్‌ను శింగనమల ఎంఈఓలు శివప్రసాద్, రామ్మూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పరామర్శించారు.

దళిత ద్రోహి జగన్

ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

అనంతపురం విద్య, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దళితుల పథకాలకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించిన ద్రోహి వైఎస్ జగన్ అని ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి మండిపడ్డారు. జిల్లాకేంద్రంలోని పెన్నార్ భవన్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. అక్కడ ఆమె మాట్లాడుతూ.. తన ఎస్సీలు, తన ఎస్టీలు అని చెప్పుకునే దళితులు.. దళితులు అభివృద్ధి చెందితే తట్టుకోలేడన్నారు. అణగదొక్కడానికే చూస్తారని ఆరోపించారు. అంబేడ్కర్ పేరుతో దళిత బిడ్డలు ప్రైవేటు పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పిస్తూ టీడీపీ బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకాన్ని అమలు చేస్తే.. దానిని జగన్ ఎత్తి వేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి తన పేరు పెట్టి రాజ్యాంగ నిర్మాత కన్నా తానే గొప్పోడని చెప్పే ప్రయత్నం చేశాడరన్నారు. టీడీపీ ప్రభుత్వం దళితులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తే.. 200 యూనిట్లు ఇస్తామని చెప్పిన జగన్ సాకులు చెప్పి అనేక మంది దళితులకు ఉచిత కరెంట్ అందకుండా చేశారన్నారు. వైసీపీ హయాంలో ఎందరో దళిత బిడ్డలకు చిత్రహింసలు పెట్టడంతోపాటు పొట్టన పెట్టుకున్నారన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి దోపిడీ చేశారని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు శ్రీదేవి పేర్కొన్నారు.

అధికారులపై ఫిర్యాదులు

అనంతరం దళిత సంఘాల నేతలతో ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సమావేశమయ్యారు. కార్పొరేషన్ అధికారులు.. దళితులపై చిన్న చూపు చూస్తున్నారని సంఘాల నేతలు.. చైర్‌పర్సన్‌కు ఫిర్యాదులు చేశారు. రుణాల కోసం వేలాదిమంది దళితులు దరఖాస్తు చేసుకున్నా వాటి గురించి పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు చెందిన వివిధ ఆస్తులు ఇతర శాఖల ఆధీనంలో ఉన్నాయని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉండవల్లి శ్రీదేవి స్పందిస్తూ దళితుల పట్ల ఎవరు, ఎక్కడ నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం దళిత సంఘాలు నేతలు సమస్యలను వివరిస్తూనే ఉండవల్లి శ్రీదేవికి వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కౌముది, ఇతర అధికారులు, సిబ్బంది, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజోతి): భర్తతో గొడవపడి మండలంలోని పల్లేపల్లిలో చాముండి(21) బుధవారం రాత్రి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లేపల్లికి చెందిన నాగమ్మ కుమార్తె చాముండిని కర్ణాటకలోని కురుగోడు గ్రామానికి చెందిన చిరంజీవికిచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం చేశారు. అక్క కాన్పు కావడంతో చూసేందుకు చాముండి బళ్లారికి వచ్చింది. అక్కడి నుంచి పల్లేపల్లికి వచ్చింది. ఈ నేపథ్యంలో భర్త చిరంజీవి కూడా వచ్చాడు. ఊరికి వెళ్దామని పిలిచాడు. తాను రానని చాముండి చెప్పడంతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్తాపం చెంది రాత్రి చాముండి ఉరేసుకుని, మృతిచెందింది. దీంతో ఆమె చావుకు భర్తే కారణమని అతడిని గ్రామస్థులు చెట్టుకు కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని, చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. చాముండి శవాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చాముండి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి



మహిళ మృతదేహం

హిందూపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలకుంట గ్రామంలో గుర్తుతెలియని మహిళ (40) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొద్దం మండలం శేషాపురానికి చెందిన ఓ వ్యక్తి తూమకుంట పారిశ్రామిక వాడలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. అతడు మూడు రోజుల క్రితం అప్పలకుంట గ్రామంలో తాను అద్దెకు ఉంటున్న ఇంటికి ఓ మహిళను తీసుకొచ్చాడు. రెండు రోజులుగా ఆరోగ్యం బాగోలేదని ఆమెను ఆస్పత్రికి కూడా తీసుకెళ్లాడు. ఏం జరిగిందో తెలియదుకానీ ఇంటికి తాళం వేసుకెళ్లాడు. చుట్టుపక్కలవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని సెక్యూరిటీ గార్డుకు ఫోన్ చేయగా.. స్విచాఫ్ వచ్చింది. ఇంటి తాళం బద్దలుకొట్టి చూడగా.. అందులో మహిళ అనుమానాస్పద స్థితిలో చనిపోయి ఉంది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

టపాసుల దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ (అక్టోబరు 20న) నేపథ్యంలో టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనంతపురం డివిజన్ పరిధిలో తాత్కాలిక లైసెన్సులు పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. www.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు పొందవచ్చన్నారు. నాలుగు సెట్ల దరఖాస్తులను ఈనెల 30వతేదీలోపు అందజేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల విచారణ అనంతరం అర్హత ఆధారంగా జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్‌ఓసీ సమర్పించిన వారికి మాత్రమే లైసెన్సులు మంజూరు చేస్తామన్నారు.

బెదిరింపులు, తరలింపులు వారివే..

● వైసీపీ నేతలపై ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపాటు


మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలను బెదిరించి సభలకు తరలించడం వంటి పనులు చేసేది వైసీపీ నేతలు మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్ అయ్యారు. కూటమి నిర్వహించిన సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ విజయవంతం కావడంపై నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాప్తాడు నియోకవర్గంలోని 6 మండలాల నుంచి ప్రజలు భారీగా సభకు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. సభలో పరిటాలశ్రీరామ్ చొరవ చూపి లక్షన్నర మందికి బిస్కెట్లు, పండ్లు, వాటర్‌బాటిళ్లు అందజేయడాన్ని అభినందించారు. లక్షల మంది ప్రజలు సభకు వచ్చి సక్సెస్ చేస్తే.... వైసీపీ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. గతంలో సిద్ధం సభకు జనాలను ఏ విధంగా తరలించారో అందరికీ తెలుసునన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అందుకున్న జనాలు స్వచ్ఛందంగా సభకు తరలివచ్చారని ఆమె తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఇలాగే మాట్లాడితే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. టీడీపీ మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై చర్చ


సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పరపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మమ్మ

అనంతపురం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు కలిపి సుమారు 40మందికి పైగానే పాల్గొన్నారు. అలాగే నలుగురైదుగురు టీడీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వారందరూ వివిధ సమస్యలపై చర్చించి పరిష్కరించారు. ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించిన సమస్యలపై వైసీపీ సభ్యులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెలగబెట్టింది ఏమీ లేదన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందా.. వారికి నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని ప్రశ్నించారు. ఇందుకు ఉప్పరపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రామలక్ష్మమ్మ కలగ చేసుకుని కూటమి ప్రభుత్వం బడికి పోయే పిల్లలకు మంచి బట్టలిచ్చిందని, బడిలో అన్నం బాగుంటోందని, పిల్లలు కూడా చక్కగా స్కూళ్లకు వెళ తున్నారని సమాధానమిచ్చారు. మీకు అనుమానం ఉంటే రండి చూపి స్తామంటూ పేర్కొన్నారు. దీంతో వైసీపీ సభ్యులు కిమ్మనకుండా ఉండి పోయారు. ఆమె మాట్లాడినంతసేపు సభ్యులంతా అలా సైలెంట్‌గానే ఉండిపోయారు. ఆమె ప్రసంగం ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఎంపీడీఓ దివాకర్, ఎంఈఓ వెంకటస్వామి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం


గిరిజమ్మను సన్మానిస్తున్న సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలోని సిబ్బందికి సకాలంలో పదోన్నతులు, కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించడంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చొరవ చూపడాన్ని అభినందిస్తూ సిబ్బంది గురువారం జెడ్పీ కార్యాలయంలో ఆమెను ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన పీఆర్ ఎస్ఈ

నూతనంగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఈ లక్ష్మీనారాయణను కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. తర్వాత జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఆవిష్కరించనున్న జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలను పరిశీలించారు.

'చప్పట్లు కొట్టాలని అడుక్కోవడమేంటి?'

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పథకాలన్నీ అమలు చేసి ఉంటే చప్పట్లు కొట్టాలని అడుక్కోవడం ఎందుకని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురంలో కూటమి పార్టీలు సూపర్‌సిక్స్ పేరుతో సభ నిర్వహిస్తే... కలెక్టర్, అధికారులంతా వారం రోజుల నుంచి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి జనసమీకరణ చేశారన్నారు. అరకొరగా మూడు హామీలు అమలు చేసి అన్ని హామీలు అమలు చేసినట్లు సీఎం చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నిజంగా హామీలు అమలు చేశామో లేదో చంద్రబాబు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు సూపర్ హిట్టేనన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారని, మోదీ,పవన్, చంద్రబాబును పొగడడానికే వాళ్లు పరిమితమయ్యారని, జిల్లాకు ఇవి కావాలని అడగలేరా..?అని నిలదీశారు.

సభ సక్సెస్.. బీజేపీ నేతల సంబరాలు


సంబరాల్లో బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలో గత బుధవారం నిర్వహించిన సూపర్‌సిక్స్ సభ గ్రాండ్ సక్సెస్ కావడం కూటమి ఐక్యతకు ప్రతీక అని బీజేపీ నాయకులు తెలిపారు. సూపర్ సిక్స్ సభ సక్సెస్ కావడంతో గురువారం వారు సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సందిరెడ్డి శ్రీనివాసులు, కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ సూపర్‌సిక్స్ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ల నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. కూటమి మరింత బలోపేతం కావడానికి ఈ సభ విజయవంతం ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లలిత్‌కుమార్, లక్ష్మీదేవమ్మ, నాగరాజు, మల్లిక, సూర్యప్రకాష్, నాగేంద్రకుమార్, అజేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద ఆశయాలను కొనసాగిస్తాం

అనంతపురం క్లాక్‌టవర్: 1893 సెప్టెంబరు 11న అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభలో స్వామివివేకానంద భారతదేశ ప్రతినిధిగా హాజరై చేసిన సందేశాన్ని స్మరించుకుంటూ గురువారం బీజేపీ నాయకులు స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభలో స్వామివివేకానంద చేసిన ప్రసంగం కోట్లాది మంది ప్రజలకు నేటికీ ప్రేరణగా నిలుస్తోందని అన్నారు.

వర్షం వస్తే.. ప్రార్థన లేనట్లే..!

● శింగనమలలోని జడ్పీ పాఠశాల ప్రాంగణంలో అడుగులోతు నీటి నిల్వ
● వర్షాకాలంలో ఉదయం ప్రార్థనకు దూరమవుతున్న విద్యార్థులు


పాఠశాల ప్రాంగణంలో నిలిచిన నీటిలో వెళ్తున్న విద్యార్థులు

శింగనమల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మోస్తరు వర్షం వస్తే విద్యార్థులకు ఉదయం పూట ప్రేయర్ లేకుండా పోతోంది. వర్షానికి పాఠశాల ప్రాంగణంలో పెద్దఎత్తున నీళ్లు నిలుస్తున్నాయి. నీళ్లు నిల్వ ఉంటుండడంతో విద్యార్థులకు ప్రార్థన చేయలేకపోతున్నారు. ఆ పాఠశాలలో గత వైసీపీ పాలనలో నాడు నేడు కింద రూ.1.80 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఈక్రమంలో పాఠశాల ముందు విద్యార్థులు ప్రేయర్ చేసేందుకు రూ.20 లక్షలు ఖర్చు చేసి సిమెంట్‌తో బెడ్డింగ్ వేశారు. అయితే పాఠశాలకు దగ్గర పెద్ద కొండ ఉండడంతో వర్షం వస్తే ఆ కొండపై నుంచి నీరు మొత్తం దిగువన ఉన్న పాఠశాల ప్రాంగణంలోకి వచ్చి నిలుస్తోంది. అయితే పనులు చేసిన కాంట్రాక్టర్ నీరు పాఠశాలలో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టలేదు. నీళ్లు బయటికి వెళ్లేందుకు కేవలం చిన్న పాటి రంధ్రం ఏర్పాటు చేయించారు. ఆ రంధ్రం ద్వారా నీరు బయటికి వెళ్లడానికి రోజుల సమయం పడుతోంది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు భారీ వర్షం రావడంతో కొండ నుంచి వచ్చే నీరు మొత్తం ప్రేయర్ చేసే ఆవరణలోకి చేరింది. ఆ నీటిలో నిలబడి ప్రార్థన చేసేందుకు విద్యార్థులకు వీలు పడడం లేదు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి నెలకొంటోందని, అధికారులు, పాలకులు స్పందించి కొండ నుంచి వచ్చే నీరు త్వరగా బయటికి పోవడానికి పెద్ద పైపులు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి: ఎస్ఎఫ్ఐ


నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం టౌన్/విద్య, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం వారు నగరంలోని టవర్‌క్లాక్‌వద్ద నిరసన చేపట్టారు. ఆసందర్భంగా జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరంచేయడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేదంటే నీట్ ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివ,నాగభూషణ,విజయ్, సోము,జయ, శశి,సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నిగమా ఫౌండేషన్, మై భారత్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్, కేహెచ్ మైండ్ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశినాయుడు, ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయ వరప్రసాద్, మానసిక వైద్య నిపుణులు గరుగు బాలాజీ, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, జయమారుతి పాల్గొని మాట్లాడారు. ఆత్మహత్యలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి చిన్న విషయాలకు క్షణికావేశాలకు లోనై బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ముఖ్యంగా యువత ప్రేమ, పరీక్షలలో ఫెయిల్ అయ్యామనే కారణాలతో మానవజన్మను ఆత్మహత్యతో దూరం చేసుకోవద్దని సూచించారు. తర్వాత నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్‌పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత క్విజ్, వక్తృత్వపోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనంద బాబు, ప్రగతిపథం యూత్‌అసోసియేషన్ సభ్యులు ప్రవీణ్‌నాయక్, కృతిక, గోపి, మల్లేశ్వరి, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీతో అద్భుత ఫలితాలు

● జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీ అద్భుతమైన ఫలితాలు ఇస్తుందని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు అన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 సెమీ ఫైనల్ పోటీలను గురువారం నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో కంప్యూటింగ్ ప్రపంచ తీరు తెన్నులను మార్చే సత్తా క్వాంటం టెక్నాలజీకి ఉందన్నారు. అనంతరం పోటీలను నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల నుంచి రెండు జట్లు చొప్పున పాల్గొన్నారు. మొత్తం పది విభాగాలకు సంబంధించిన క్వాంటం టెక్నిక్స్, అల్గారిథమ్స్‌ను ప్రజెంట్ చేశారు. ఈ పోటీలకు లండన్‌కు చెందిన డీప్ ఇన్ఫినిటీ సీఈఓ రామకృష్ణ, ఎస్కేయూ అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ చంద్రమౌళి, గణిత ఆచార్యులు కేశవరెడ్డి, ఫిజిక్స్ ఆచార్యులు పద్మసువర్ణ, కంప్యూటర్ సైన్సు ఆచార్యులు శివకుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రతి విభాగం నుంచి మొదటి రెండు స్థానాలు పొందిన జట్లు అమరావతిలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ భవిష్యత్‌లో కంప్యూటింగ్ రంగం రూపురేఖలను మార్చివేయగలద న్నారు. విద్యార్థులంతా ఇటాంటి కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాల న్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌డీఐసీ ఆచార్య శోభాబిందు, కోఆర్డినేటర్స్ ఆచార్య మాధవి, రాజశేఖర్, ఏపీఎస్‌సీహెచ్‌ఈ అడ్వైజర్ రాజేంద్ర, సీనియర్ ఆచార్యులు ఆనందరావు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక పతకాలు సాధించాలి: వీసీ

అనంతపురంరూరల్: ఆల్ ఇండియా, సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో ఎక్కువ పతకాలు సాధించాలని విశ్వవిద్యాలయం ఉపకులపతి, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ సుదర్శన్‌రావు సూచించారు. వర్సిటీలో 16వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశాన్ని కౌన్సిల్ కార్యదర్శి నారాయణరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి వర్సిటీ ఉపకులపతి, స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ సుదర్శన్‌రావు హాజరై మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి వివిధ క్రీడలను నిర్వహించాలని స్పోర్ట్స్ కౌన్సిల్‌కు వివరించారు. ఆమేరకు ఆల్ ఇండియా, సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో పాల్గొనేందుకు యూనివర్సిటీ అధికారులు తగిన ఆర్థిక వనరులకు అనుమతి ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, డీపీ ఆచార్య సత్యనారాయణ, డీఈ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, సీతంఏ ఫిజికల్ డైరెక్టర్ జోజిరెడ్డి, ఎస్కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్యులు శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు

ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా స్థాయి ఫెన్సింగ్, గట్కా జట్లను గురువారం ఎంపిక చేశారు. గురువారం స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య పాఠశాల మైదానంలో సెలెక్షన్స్ నిర్వహించారు. డీవీఈఓ వెంకటరమణ నాయక్, అనంతపురం డివిజన్ విద్యాధికారి శ్రీనివాసరావు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను స్కూల్ గేమ్స్ సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. ఫెన్సింగ్ అం డర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో మొ త్తం 45 మందిని ఎంపిక చేశారు. గట్కా అం డర్-17, 19 బాలబాలికల విభాగాల్లో 30మంది ఎంపికయ్యారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కార్యదర్శి తెలిపారు. పీడీలు, ఆయా అసోసియేషన్ల నేతలు పాల్గొన్నారు.

ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ పట్ల అవగాహన కల్పించాలి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ పొందడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని అధికారులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల ఏడీఏలు, ఏఓలకు ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ ద్వారా కలిగే ప్రయోజనాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఉమామహేశ్వరమ్మ పాల్గొని మాట్లాడారు. మేలైన సాగు విధానాలు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితోపాటు నాణ్యమైన ఉత్పత్తులను పొందవచ్చునన్నారు. పొలం బడి కార్యక్రమాల్లో 14 వారాల్లో నిర్దేశించిన పనులను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ పొందడం ద్వారా రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. ఏపీ రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ విత్తన ధ్రువీకరణ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇండ్‌గ్యాప్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు పాటించాల్సిన పద్ధతులు, కావాల్సిన పలు డాక్యుమెంట్లను వివరించారు. కమిషనరేట్ ఏడీ వెంకటేశ్వర్లు, టెక్నికల్ ఏఓలు సునీత, రాకేష్‌నాయక్, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

సభ నిర్వహణ పనులను చక్కగా చేశారు

● ఏఎంసీ కమిషనర్, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు


సభాప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ సభకు ఏర్పాట్లు, పార్కింగ్‌తో పాటు ఇతర పనులను చేయడంలో.. సభ అనంతరం పరిసరాలను శుభ్రం చేయించడంలో చక్కగా పనిచేశారని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, అధికారులు, సిబ్బందిని కలెక్టర్ వినోద్‌కుమార్ అభినందించారు. గత పది రోజులుగా సభ ఏర్పాట్లు చేయడంలో ఏఎంసీ కమిషనర్, అధికారులు, సిబ్బంది పనిచేశారు. సభ అనంతరం గురువారం కమిషనర్ బాలస్వామి అధికారులతో కలిసి పరిసరాలలో పడేసిన చెత్తను, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించారు. దీంతో వారిని కలెక్టర్ అభినందించారు.

శ్మశాన వాటిక పరిశీలన

ఆంధ్రజ్యోతి స్పందన

గార్లదిన్నె, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి మండలంలోని మర్తాడు గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటికను రెవెన్యూ అధి కారులు గురువారం పరిశీలించారు. ఆ స్మశాన వాటికి ఆక్రమణకు గురవుతుండడంపై గతవారం రోజుల క్రితం ఆక్రమణలో ఎస్సీల శ్మశాన వాటిక అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్ఐ, వీఆర్ఓ, సర్వేయర్ మర్తాడు గ్రామానికి వెళ్లి ఎస్సీ శ్మశాన వాటికను పరిశీలించారు. త్వరలోనే సర్వే చేయించి ఎస్సీలకు ప్రభుత్వం కేటాయించిన భూమిని చూపుతామని తెలిపారు.

ఎస్కేయూలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోండి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఉద్యోగ సంఘాల నాయకులు సంజీవులు, నారాయణప్ప కోరారు. ఆమేరకు గురువారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వర్సిటీలో 2017లో బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందన్నారు. 12వేలమందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే వర్సిటీలో పనిచేసే కొంత మంది అగ్రవర్ణాల వారు ఎస్సీ,ఎస్సీల ఎదుగుదలను ఓర్వలేక పోస్టులను భర్తీ కాకుండా కోర్టుకు వెళ్లారన్నారు. అప్పటి నుంచి వర్సిటీ అధికారులు స్పందించడం లేదన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎరా స్కూల్ విద్యార్థి


విష్ణువర్ధన్

అనంతపురం రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని కొడిమి సమీపంలో గల ఎరా స్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికయ్యాడు. ఉరవకొండలో గురువారం ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సెపక్ తక్రా అండర్ -14 పోటీలు నిర్వహించారు. ఇందులో ఎరా స్కూల్ విద్యార్థి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సెపక్ తక్రా సెక్రటరీ మారుతి ప్రసాద్ తెలిపారు. విద్యార్థిని పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్ రెడ్డి, డైరెక్టర్ వినూత్న రెడి అభినందించారు.

కేరళ కాంక్లేవ్‌కు మేయర్ వసీం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కొచ్చిన్‌లో ఈనెల 12, 13వతేదీలలో జరిగే కాంక్లేవ్-2025 సదస్సుకు అనంతపురం మేయర్ మహ్మద్ వసీం సలీం హాజరుకున్నారు. నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై ఆయన అక్కడ మాట్లాడనున్నారు.

విజేత మధ్యప్రదేశ్

● ముగిసిన ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ విజేతగా మధ్యప్రదేశ్ నిలిచింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీటీ స్టేడియంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. పాయింట్లు ఆధారంగా మధ్యప్రదేశ్ విజేతగా, రన్నరప్‌గా బరోడా, తృతీయ స్థానంలో సెక్రటరీ లెవెన్ జట్టు, ప్రెసిడెంట్ లెవెన్ నాలుగో స్థానంలో నిలిచాయి. బెస్ట్‌ప్లేయర్‌గా కేహెచ్ వీరారెడ్డి (295పరుగులు), ఉత్తమ బ్యాటర్ విశ్వాస్‌పటేల్ (235పరుగులు), ఉత్తమ బౌలర్‌గా షాహల్‌హమీద్ (15 వికెట్లు) నిలిచారు. భారత మాజీ ఆటగాడు జాకబ్ మార్టిన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, కోచ్‌లు క్రీడాకారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభతో.. నగరం శుభ్రం


అంబేడ్కర్ భవన్ ఎదుట రోడ్డుపై గుంతలను పూడ్చిన దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన జరిగిన సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ ప్రభావంతో నగరాన్ని శుభ్రం చేశారు నగరపాలక సంస్థ అధికారులు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు మం త్రులు సభలో పాల్గొనేందుకు వస్తున్న నేపథ్యంలో ఇటీవల అధికారులు నగరంలో గుంతల రోడ్లను బాగు చేశారు. మురుగుకాలవలను శుభ్రం చేశారు. ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి, ఎక్కడా చెత్త కనిపించకుండా చేశారు. ఎక్కడ చూసినా క్లీన్‌గా కనపడింది. సీఎం సభ పుణ్యమా అని నగరాన్ని అధికారులు శుభ్రం చేయించారు. దీంతో నెలకు ఒక సారి సీఎం నగరానికి వచ్చిపోతే బాగుంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు.

ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నరేంద్ర చౌదరి


నరేంద్ర చౌదరిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అమిలినేని నరేంద్ర చౌదరి నియమితులయ్యారు. ఆయనతో పాటు 10మంది సభ్యులను నియమిస్తూ గురువారం ఏపీ ధార్మిక పరిషత్ సెక్రటరీ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా అమిలినేని నరేంద్ర చౌదరి, సభ్యులుగా రాజు, వెంకటరమణమ్మ, రత్నమ్మ, వనితాబాయ్, చరణ్‌తేజ్, ఎంఎన్ ఆదిశేషయ్య, రాధ, అనంతకుమార్, కిశోర్‌కుమార్‌ను నియమించారు. ఈ నేపథ్యంలో గురువారం శివాలయం ఆవరణలో ధర్మకర్తల మండలి నూతన చైర్మన్‌ను టీడీపీ అనంతపురం ఆర్గనైజింగ్ సెక్రటరీ వినయ్‌కుమార్, 44వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్, స్పోక్స్ పర్సన్ బాబా, బూత్ ఇన్‌చార్జి మహేంద్ర కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనంత పద్మనాబులు, పీడీ చిత్రా ఓబుళేశు తెలిపారు. అనంతపురంలోని ఆర్డీటీస్టేడియంలో గత మంగళవారం జిల్లా సాఫ్ట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న మోక్షిత, తులసి ప్రతిభకనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 26వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరిగేరాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఆ విద్యార్థినులను బుధవారం స్కూల్‌కమిటీ శాశ్వతసభ్యుడు కుంటిమద్దిరంగయ్య, కమిటీ చైర్మన్ జగన్నాథం, ఉపాధ్యాయులు అభినందించారు.

'బానిసల్లా చూస్తే సహించం'


నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమకు అప్పగించిన ఎంతటి పని అయినా చేస్తామని, అయితే బానిసలుగా అసభ్యకరపదజాలంతో దూషిస్తే సహించేది లేదని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు హెచ్చరించారు. మున్సిపల్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా తీరుకు వ్యతిరేకంగా గురువారం ఉదయం వారు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో విధులు బహిష్కరించి ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషా నీటి సరఫరా విభాగం కార్మికులను చిన్నచూపు చూస్తూ అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని వాపోయారు. వారు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసి అధికారుల మన్ననలను పొందుతున్నారని, అయితే ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన తీరును ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మార్పు రాలేదని అన్నారు. ఇప్పటికైనా అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి'

అనంతపురం విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ఇచ్చిన జీఓకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డీఎస్సీ-2003 టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం వారు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు చేపట్టారు. అందులో భాగంగా అనంతపురంలోని తహసల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిసనలో పలువురు మాట్లాడుతూ.. 2003డీఎస్సీ నియామకాలను ప్రభుత్వమే అపుడు కొన్నికారణాలతో 2004లో చేపట్టిందన్నారు. దీంతో పాతపెన్షన్ వర్తించదని దూరం చేయడం అన్యాయమన్నారు. కేంద్రం ఉద్యోగులకు పాతపెన్షన్‌కు అవకాశం కల్పించిందన్నారు. ఆజీఓను రాష్ట్రంలోను అమలుచేయాలని కోర్టు తీర్పుఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే రాష్ట్రప్రభుత్వం మాబాధలు గుర్తించి జీఓమేరకు పాతపెన్షన్ వర్తింపజేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డీఎస్సీ ఫోరం కన్వీనర్ మధుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మికి ఆర్థిక సాయం

అనంతపురం క్రైం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఆమె ఇళ్లలో పనికి వెళ్తుంది. భర్త మరణించాడు. ముగ్గురు పిల్లలతో, పూట గడవడమే కష్టం. సీఎం చంద్రబాబు అంటే ఆమెకు అభిమానం. 40 ఏళ్ల వయసులోనూ ఆమె లక్షలాది మంది పోగైన సూపర్ సిక్స్-సూపర్‌హిట్ సభకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆ బాధిత మహిళే శ్రీలక్ష్మి. అనంతపురం నగరంలోని ఓబుళదేవనగర్‌కు చెందిన ఆమె డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. భర్త మరణించడంతో తనకున్న ఇద్దరు కుమారులు మౌనిక, మానస, కుమారుడు మణితేజను అతికష్టంపై పోషిస్తోంది. చంద్రబాబుపై అభిమానంతో సభకు బస్సులో వెళ్లింది. ఈ క్రమంలో బస్సు నుంచీ కిందపడటంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాజీ మేయర్ మదమంచి స్వరూప.. శ్రీలక్ష్మిని గురువారం పరామర్శించారు. బాధితురాలి ఇంటికెళ్లి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న స్వరూప

ఈ రోడ్లపై ప్రయాణం .. నరకం..!



కంకర తేలి అధ్వానంగా ఉన్న విరుపాపల్లి రోడ్డు



విరుపాపల్లి నుంచి కళ్యాణదుర్గం గేట్‌కు వెళ్లే రహదారి

కంకర తేలి.. గుంతలమయమైన గ్రామీణ రహదారులు

బెళుగుప్ప, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల రోడ్లు గుంతలమయమై... కంకర తేలాయి. వాటిపై ప్రయాణం నరకయాతనంగా మారింది. వెంకటాద్రిపల్లి నుంచి శీర్పి మీదుగా విరుపాపల్లికి ఉన్న ఐదు కిలోమీటర్ల రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది. రైతులు పొలాల్లోకి బైక్‌లు, ఎడ్లబండ్ల, ఇతర వాహనాల్లో వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. కాలినడకన కూడా వెళ్లడానికి వీలు కావడం లేదు. విరుపాపల్లి నుంచి కళ్యాణదుర్గం గేట్ వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రోడ్డు దారుణంగా ఉంది. వర్షం వచ్చిందంటే రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి మరీ అధ్వానంగా మారుతోంది. యలగలవంక నుంచి నరసాపురం గేట్ వరకు రోడ్డులో మోకాలిలోతు గుంతలు ఉన్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్లు బాగుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై బెళుగుప్ప పంచాయతీరాజ్ ఇంజనీర్ పరశురాంను వివరణ కోరగా... మూడు గ్రామాల రోడ్లు పరిశీలించి రెండు నెలల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు చేసిన వెంటనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

అభిమానులకు కృతజ్ఞతలు

సభ సక్సెస్‌పై ఎమ్మెల్యే అమిలినేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభ విజయవంతం కావడానికి సహకరించిన అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక ప్రజావేదిక వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. బీటీపీ, హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ ఏ, బీ ద్వారా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఈ సంవత్సరంలోనే నీరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని సీఎం చంద్రబాబు, అలాగే నియోజకవర్గంలో రెండు వేలు కిలోమీటర్ల రహదారులు ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ ఇవ్వడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి భారీఎత్తున కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్నడూలేని విధంగా ప్రజలు తండోప తండాలుగా తరలివెళ్లారన్నారు. ఈ నియోజకవర్గం నుంచే సుమారు 20 వేల మంది తరలివెళ్లి మన బలాన్ని చాటిచెప్పామన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ టీడీపీ అభివృద్ధికి కృషి చేద్దామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చౌళం మల్లికార్జున, వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ వైపీ రమేష్, టీడీపీ మండల కన్వీనర్లు గొళ్ల వెంకటేశులు, పాలబండ్ల శ్రీరాములు, మార్కెట్ యార్డు ఛైర్మన్ లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కోసం పడిగాపులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేదని జిల్లా అధికారులు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మండలంలోని గురువారం బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట, గోవిందవాడ, దేవగిరి ఆర్ఎస్‌కేలతో పాటు ఉద్దేహాళ్‌లో కోరమండల్‌లో యూరియా పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు ఆయా కేంద్రాల వద్ద వేకువజామున నుంచీ క్యూలైన్‌లో టోకెన్ల వారీగా వేచి ఉన్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు యూరియా కొరత లేదంటూ మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. పది ఎకరాలున్న రైతులకూ ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. కాగా, మండలంలోని ఆర్ఎస్‌కే, కోరమండల్‌లో యూరియా పంపిణీని తహసీల్దార్ మునివేలు పరిశీలించారు. రెండురోజుల్లో రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే రైతులందరూ వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

● బెళుగుప్ప : యూరియా పంపిణీ చేయాలంటూ బ్రాహ్మణపల్లి తండా రైతులు మండలంలోని నరసాపురం సచివాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. తమ తండాలో 120 మంది రైతులుండగా ఒక బస్తా కూడా అందలేదని రైతులు గోపాల్ నాయక్, సింహాద్రినాయక్, వెంకటేష్ నాయక్, శీనా నాయక్ వాపోయారు. అధికారులు స్పందించి యూరియా పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఓ పృథ్వీసాగర్ అక్కడి రైతులతో మాట్లాడి.. రెండు రోజుల్లో నరసాపురం సచివాలయానికి యూరియా చేరుతుందని, అర్హులైన రైతులందరికీ యూరియా పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



ఉద్దేహాళ్ కోరమండల్ వద్ద గుమికూడిన రైతులు



నరసాపురం సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

గుంత ముప్పు తప్పింది..!

విడపనకల్లు మండలంలోని వీ కొత్తకోట గ్రామంలో రోడ్లు దెబ్బతిని మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో నీరు నిల్వ ఉంటుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్లలో ప్రయాణం అంటేనే బెంబేలెత్తేవారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న గుంతలను ఎక్స్‌కవేటర్లతో తవ్వించి, లెవల్ చేయించారు. అనంతరం రోడ్డుపై ఎర్రమట్టి వేయించి, చదును చేశారు. కంకర వేసి, తొక్కించడంతో ప్రజలకు గుంతల భయం తప్పింది. త్వరలోనే విడపనకల్లు నుంచి వీ కొత్తకోట వరకూ తారు రోడ్డు వేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

-విడపనకల్లు(ఆంధ్రజ్యోతి)



నీటి గుంతలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో



రోడ్డు గుంతను పూడ్చివేస్తున్న దృశ్యం

ముగిసిన ఉరుసు

విడపనకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బడేషావలి ఉరుసు ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలులో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి వారి సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. రాత్రి 10 గంటల నుంచి గురువారం తెల్లవారుజామున మూడు గంటల వరకూ ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి వారి షంషేర్‌ను గుర్రంపై ఉంచి ఊరేగించారు.



గుర్రం పాదాలకు నీరు పోస్తున్న యువకులు

నిరుపయోగంగా సంపద కేంద్రాలు

● అధికారుల్లో లోపించిన చిత్తశుద్ధి
● నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం



జంగంరెడ్డిపేటలోని చెత్తతో సంపద తయారీ కేంద్రం

పుట్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. లక్షలు వెచ్చించి.. నిర్మించిన చెత్తసంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. నిర్వహణ లేక పిచ్చిమొక్కలు, కంపచెట్లతో నిండిపోయాయి. మండలవ్యాప్తంగా 23 పంచాయతీల్లో 23 చెత్తసంపద కేంద్రాలను 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. సుమారు రూ. 5.30 లక్షలతో ఒక్కొక్క చెత్తసంపద కేంద్రాన్ని నిర్మించింది. క్రిమిసంహారక ఎరువుల వాడకం తగ్గించి సహజసిద్ధంగా తయారుచేసే వర్మీకంపోస్టు ఎరువును వాడాలనే లక్ష్యంతో నాటి టీడీపీ ప్రభుత్వం వీటిని ఏర్పాటుచేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటికి పూర్వ వైభవం తెచ్చేలా చర్యలు చేపట్టినా... కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ లక్ష్యం నీరుగారింది. మండలంలో గాండ్లపాడు, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి, రంగమనాయునిపల్లి తదితర గ్రామాల్లో ఆ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. మిగతా గ్రామాల్లో కొన్నిచోట్ల మాత్రమే వానపాములను వేసి వర్మీకంపోస్టు ఎరువులు తయారుచేస్తున్నారు. గత నెలలో కలెక్టర్ వస్తున్నాడని కడవకల్లులో నిరుపయోగంగా ఉన్న చెత్తసంపద కేంద్రాన్ని ప్రారంభించారు. మండలకేంద్రంలో మాత్రం సుమారు ఐదేళ్ల నుంచి ఎరువులను త యారుచేస్తూ విక్రయిస్తున్నారు. కొన్నిగ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను అనువైన ప్రాంతంలో నిర్మించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల కు సుమారు కిలోమీటరు దూరంలో ఉండటం తో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.

వర్మీకంపోస్టు ఎరువులకు డిమాండ్

ఉద్యానవన పంటలకు క్రిమిసంహారక ఎరువులు గతంలో ఎక్కువగా వేసేవారు. ప్రస్తుతం కాలానుగుణంగా వాటి వాడకం తగ్గించి సహజ సిద్ధంగా తయారుచేస్తున్న వర్మీకంపోస్టు ఎరువులను ఎక్కువగా వాడుతున్నారు. దీంతో వాటికి ఎక్కువ డిమాండ్ ఉంటోంది. కేజీ రూ. 10 నుంచి 15 చొప్పున వర్మీకంపోస్టు ఎరువును విక్రయిస్తున్నారు. వచ్చిన ఆదాయాన్ని ఆయా గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం వినియోగిస్తున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం

మిగిలిన పంచాయతీల్లో నిర్వహణలో లేని చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తాం. కొన్నిచోట్ల చెత్తను సంపద కేంద్రానికి తరలించడంలో పలు సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించి నిర్వహణలోకి తీసుకువస్తాం.

-శివప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ

న్యూస్ బాక్స్

హుండీ ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

తాడిపత్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారికి హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని గురువారం లెక్కించినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. 2024 నవంబరు 28 నుంచి ఈ సెప్టెంబరు 11 వరకు రూ.8,75,824 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్‌దాస్, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై రణభేరి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రణభేరి పేరుతో జిల్లాలో బైక్ జాతాను నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక మున్సిపల్ బాలికల పాఠశాలలో గురువారం ఆవిష్కరించిన వారు మాట్లాడారు. జిల్లాలో ఈనెల 16న గుంతకల్లు నుంచి ప్రారంభమయ్యే ఈ బైక్ జాతా ... వజ్రకరూరు, ఉరవకొండ, కణేకల్, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా సాగుతూ.. అనంతపురంలో ఈ నెల 19న ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు రాఘవేంద్ర, రాజ్‌కుమార్, శంకరయ్య, రవిబాబు, రామ్మోహన్, రేవనసిద్ధయ్య, శంకర్‌నాయక్, రవిప్రసాద్, కల్పన, గిరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

● ఉరవకొండ: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో రణభేరి పోస్టర్లను యూటీఎఫ్ నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జయరాములు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, శ్రీనివాస్ గుప్తా, నాగరాజు, మధుబాబు పాల్గొన్నారు.

● యాడికి: తమ సమస్యలు పరిష్కరించాలని యాడికిలో ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఇందులో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్, నాయకులు రాజశేఖర్‌నాయుడు, రవికుమార్, శ్రీదేవి, మంజుల, స్వర్ణగంగ పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: మెమో 57ను అమలు చేయాలని డీఎస్సీ 2003 ఉద్యోగుల కోరం జిల్లా కన్వీనర్ కట్టయ్య కోరారు. ఈమేరకు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, రామాంజినేయులు, 2003 డీఎస్సీ ఉద్యోగస్థులు పద్మజ, సుజాత పాల్గొన్నారు.

● తాడిపత్రి: టీచర్ల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వారం పాటు నిరసనలు చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి తెలిపారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. హామీలను అమలు చేయాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. ఇందులో పట్టణఅధ్యక్షుడు జయచంద్ర, ఉపేంద్ర, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే




కేక్ కట్‌చేస్తున్న కళాశాల కరస్పాండెంట్ హరికుమార్

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో విద్యార్థులు గురువారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో బీకాం కంప్యూటర్ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నటరాజ్, అధ్యాపకులు అమీర్, బసెట్టి కృష్ణయ్య, కృష్ణానంద, సుభాషిని, ప్రకాష్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

గుత్తి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ముందస్తు చర్యగా మున్సిపల్ కార్యాయలంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా గురువారం తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షం నీరు నిలచిన ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికంగా చర్యలు చేపడతామని, వర్షాలతో ఏమైనా సమస్యలొస్తే 91009 86895కు తెలియజేయాలని అన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి

శెట్టూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి మండలంలోని అయ్యగార్లపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50 వేలను గురువారం విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మంజునాథ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 2,138 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,138 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,098 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీలు నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1,998 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజోతి): మండలంలోని టీ వీరాపురం గ్రామంలో కురిసిన వర్షానికి రాయదుర్గం నుంచి కణేకల్లుకు వెళ్లే రహదారిలో ఉన్న రెండు భారీ వృక్షాలు విద్యుత్ 11 కేవీపై కూలాయి. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఫైర్ అధికారులు ఆ రెండు చెట్లను తొలగించారన్నారు. విద్యుత్ లేకపోవడంతో నీటి సరఫరాకు సమయం పడుతుందని, పట్టణ ప్రజలు దీన్ని గమనించాలని అన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

విడపనకల్లు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొట్టాలపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు వెంకట జయశంకర్ ఇదే పాఠశాలకు రూ.16,500 విలువైన మైక్ సెట్‌ను గురువారం అందజేశారు. దాన్ని ఆ పాఠశాల హెచ్ఎం శేషగిరికి అందించారు.



క్రైం న్యూస్..

దుకాణంలో చోరీ

యాడికి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కిరాణా దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రూ.10వేలు నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు దుకాణ యజమాని అంకాలు వాపోయాడు. దుకాణానికి ఉన్న రేకును తొలగించి దొంగలు చోరీకి పాల్పడినట్లు తెలిపాడు.

చిరుత దాడిలో రెండు గొర్రెల మృతి

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చిరుతదాడి చేయడంతో మండలంలోని కోనాపురంలో గొర్రెల కాపరి ఈశ్వరయ్యకు చెందిన రెండు గొర్రెలు మరణించాయి. కోనాపురం, గొల్లపల్లి గ్రామాల మధ్య గొర్రెలు గురువారం మేస్తుండగా చిరుత దాడి చేయడంతో రెండు గొర్రెలు మరణించాయని, దీంతో తనకు సుమారు రూ.30 వేల నష్టం వాటిల్లిందని ఈశ్వరయ్య వాపోయారు.

యూట్యూబ్ చానల్‌పై ఫిర్యాదు

తాడిపత్రి, సెప్టెం బరు 11 (ఆంధ్రజ్యోతి): జేసీ కుటుంబం మీద ఓ యూట్యూబ్ చానల్ యాజమాన్యం అసత్య ఆరోపణలు చేస్తోందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ షెక్షావలి, కౌన్సిలర్ మల్లికార్జున గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనికట్టుకొని అసత్య ఆరోపణలు ప్రచారం చేస్తున్నారని, తాడిపత్రిలో ప్రశాంతతకు భంగం కలిగేలా చేస్తున్నారని ఆ యూట్యూబ్ చానెల్ వైస్ ఛైర్మన్, యాంకర్లపై ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదు చేస్తున్న వైస్‌ఛైర్మన్, కౌన్సిలర్

ఇరువురి ఘర్షణ

తాడిపత్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక యాక్సిస్ బ్యాంక్ సమీపంలోని ఓ టీకేఫ్‌లో గురువారం రాత్రి టీ డబ్బులు చెల్లించే విషయంలో టీకేఫ్ యజమాని శివకుమార్, అబ్బాస్ గొడవ పడ్డారు. కొట్టుకొని గాయపడ్డారు. పరస్పరం ఫిర్యాదుల మేర కు కేసులు నమోదు చేస్తామని పట్టణ ఏఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

కూటమి ప్రభుత్వం సూపర్ సక్సెస్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బెళుగుప్ప, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో కూటమి ప్రభుత్వం సూపర్ సక్సెస్ అయిందని, దీంతో బుధవారం అనంతపురంలో సీఎం చంద్రబాబు నిర్వహించిన సభ భారీగా విజయవంతమైందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షుడు పెద్ద తిప్పయ్య, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు రాము, ఎస్సీ సెల్ నాయకులు తిప్పేస్వామి గురువారం మీడియాతో మాట్లాడారు. కేవలం 14 నెలల్లో టీడీపీ హయాంలో ఎంతో అభివృద్ధి చేశామని, మంత్రి పయ్యావుల కేశవ్ మండల రూపురేఖలే మార్చివేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లోపు మండలంలోని రామసాగరం బ్రిడ్జిని నిర్మించే.. ఓటు అడుగుతామని మంత్రి స్పష్టం చేశారన్నారు.

అధిక యూరియాతో అనర్థం



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజోతి): పంటలకు యూరియాను అధికంగా వడటం వల్ల కలిగే అనర్థాలపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పథక సంచాలకులు టీ పద్మలత మండలంలోని ఆవులదట్ల, రేకులకుంట గ్రామాల్లో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. మోతాదుకు మించి యూరియా వాడటం వల్ల చీడపీడలు అధికమవుతాయని, నేలలో పోషణ విలువలు తగ్గుతాయని, కాండం పెలుసుగా మారి గాలికి పంటకు కూలుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహులు, రుమానబేగం, రైతు సేవా సహాయకులు రైతులు పాల్గొన్నారు.

వలంటీర్ బాధ్యతల నుంచి తప్పించండి

తాడిపత్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వలంటీర్ బాధ్యతల నుంచి తమను తప్పించాలని సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగ ఐక్యవేదిక జేఏసీ కోరిక మేరకు 15 రోజుల లోపు ఈ సమస్య పరిష్కరించాలని, లేకుంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. తొమ్మిది నెలల ప్రొబెషన్ బకాయిలు, రెండు ఇన్‌క్రిమెంట్‌లు, ఆరేళ్లు పూర్తిచేసుకున్న ఉద్యోగులకు ఏఏఎస్ ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. రాత్రివేళల్లో, ఎప్పుడుబడితే అప్పుడు ఆఫీసులకు రావాలంటూ అధికారులు ఆదేశాలు ఇవ్వడమే కాకుండా.. అసభ్యకరంగా మాట్లాడుతున్నారని వాపోయారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లుటౌన్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కుమ్మర శాలివాహన కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కుమ్మర శాలివాహన సంఘం సంక్షేమ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. స్థానిక భాగ్యనగర్‌లోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 15 రోజుల నుంచి జిల్లా అంతట పర్యటిస్తూ కులస్థుల సమస్యలు గుర్తిస్తున్నానని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ డైరెక్టర్లు నాగేంద్ర, సుబ్బయ్య, గుంతకల్లు కుమ్మర శాలివాహన సంఘం అధ్యక్షుడు అంజి, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, కోశాధికారి గోపాల్, విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఐటీసీ తిమ్మప్ప పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తాడిపత్రి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 45 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.33,88,030 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను కొంతమంది బాధితులకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి గురువారం అందజేశారు. మిగిలిన బాధితులకు ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకుల ద్వారా వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకున్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే